# ప్రథమాధ్యాయం

'తాతా? తాతా?'

సూరన్న తాత ఉదయమంతా పొలంలో పనిచేసి అలసిపోయి, చెరువులో స్నానం చేసి, ఎడ్లని కడిగి, పశువుల సాలలో వాటిని కట్టి, చల్లంది (చద్దన్నం)కి సుమారు పదిగంటల వేళకి అప్పుడే ఇంటికి వచ్చాడు. మూడేళ్ల శంకు ఎదురుగా రావటం చూసి, మనవడిని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు  సూరన్నతాత. అంత వరకు ఇల్లంతా, ఊరంతా వెతుకుతున్న శంకు, తాత కనిపించడంతోనే పరుగు తీశాడు తాత దగ్గరికి. ఆయింట్లో శంకుకి అందరూ కొత్తవాళ్లే కనబడుతున్నారు. ఒక్కొక్కరూవచ్చి శంకుని చూసి తల్లిలేని వాడయిపోయినాడని కన్నీళ్లుపెట్టుకుని గుండెలు చెరువుచేసుకుని వెళ్లిపోతున్నారు. అంతా ఏమిటోగావుంది శంకుకి. తాత తప్పించి ఇంకెవరూ తెలీదు. ఈ మధ్యనే వచ్చాడు తాతగారింటికి. చనువూలేదు.

'తాత; అమ్మ?' అని శంకు మాటలకి వెతుక్కుంటున్నాడు.

తాత ఏం చెబుతాడు?

శంకుకి రెండు దినాలుగా అమ్మ కనబడటంలేదు. పాలు పెట్టటంలేదు. ఆకలేసినపుడల్లా అమ్మకోసం ఏడుస్తున్నాడు. ఎవరో గ్లాసుతో పాలు బలవంతంగా తాగిస్తున్నారు. అమ్మ ఏది అని అడిగితే 'వూరెళ్లింది. రేపొస్తుంది' అని చెప్పాడు తాత. 'రేపొస్తుంది' అంటే ఆ మూడేళ్లవాడికి అర్థం కావటం లేదు. మళ్లీకొంతసేపాగి-

'తాతా అమ్మ?' మళ్లీ వెర్రిచూపులతో, దిక్కులేని బాధతో అడిగాడు శంకు.

ఆ రెండు ముద్దుమాటల్లో - అమ్మ రాదా? పాలు పెట్టదా? ఎత్తుకుని తనని ఆడించదా? లాలించదా? ముద్దులు కురిపించి మురిసిపోదా? కళ్లల్లోకి చూచి గర్వించదా? ఊయల్లో వేసి లాలిపాడదా? జో కొట్టదా? తన పొట్టలో దాచుకుని నిద్ర పోదా? నాన్నా అని పిలిచి ఆడుకోదా? ఎప్పుడొస్తుంది? అంతవరకు నేనెట్లా బ్రతకను? ఎవరిని అమ్మాఅని పిలవను? ఎవరు నన్నెత్తుకుంటారు? ఎవరు నా ఆకలి తీరుస్తారు? - ఇన్ని ప్రశ్నలు సూరన్న తాతకి వినిపిస్తున్నాయి.

సూరన్న తాతకళ్లల్లో కన్నీళ్లు చేరి రాలుతున్నాయి. తాత కన్నీళ్లు వొత్తు కుంటున్నాడు.

'తాతా అమ్మ -' అన్నాడు మళ్లీ. సూరన్న తాత శంకుని గుండెలకి అదుముకున్నాడు. తాత కళ్లల్లోకి చూస్తున్నాడు శంకు, ఏ మైనా అర్థమౌతుందేమోనని.

'శంకూ - అమ్మ పెత్తాతగారూ - ఇంటికి - బొద్దామూ వెళ్లిందీ'

'బొద్దామా?' అమాయికమైన శంకు గొంతుకి బొద్దాము అంటే తెలిసి నట్టుంది. ఎప్పుడో కొన్నాళ్లు అమ్మతో పాటు ఆ వూర్లో ఉన్నాడు. అమ్మ తీసుకెళ్లింది అక్కడికి. అక్కడ పెత్తాత ఉన్నాడు.

'బొద్దామూ - వెళ్లింది. రేపూ - రేపూ వస్తాది' తను చెప్పింది అర్థమవాలని మరీ దీర్ఘాలుతీసి చెబుతున్నాడు సూరన్నతాత.

'రేపా?' అన్నాడు అమాయికంగా. ఆ రేపు అన్నది అర్థమయినట్టు లేదు. ఆ మాటలో ఎంత కాలవ్యవధి ఉందో వాడికి తెలీదు. కాని తాత నొక్కి చెపుతోంటే ఆ రేపు అన్నది చాల దగ్గర్లో ఉన్నట్టుగానే ఉంది.

'నీ కోసం కజ్జిమూ, కృష్ణలాంటి పుస్తకాలూ, మళ్లీ జుబ్బాలూ -'

'కజ్జిమా?'

'కజ్జిమూ (మిఠాయి) జుబ్బాలూ'

'జుబ్బాలా?'

'మళ్ళీ బొమ్మలూ, చెక్రమూ'

'బొమ్మలూ చెక్కమా?'

'ఇంక చాలా, బోలెడు, ఎన్నో తెస్తాది'

'చాలా?'

అమాయకమైన చూపులతో, కళ్లింతవిచేసి, తల కిందికీ మీదికీ ఊపుతో అడుగుతున్నాడు.

'తెస్తాది'

'తెత్తాదా'

అన్నీ అడిగిన తర్వాత, తాత తనకి తోచినంత చెప్పిన తర్వాత, చెప్పినంత సేపూ విని, 'తాతా, అమ్మ?' అంటున్నాడు మళ్లీ. ఇంక సమాధానంచెప్పలేక తాత, శంకుని యెత్తుకుని పశువుల శాలలోకి తీసుకునివెళ్లాడు. ఆ ఎడ్లనీ, దూడలనీ చూపించి, తను నిమిరి, శంకు అమ్మ ప్రశ్న మరచిపోయేటట్టు చేశాడు. ఆ దూడల దగ్గర ఆడుకున్నంతసేపూ చూసి, శంకుచేత నవ్వించి, వాడికి విసుగు పుట్టినట్టు కన్పించడముతో అక్కడినుంచి పెరట్లోని తోటకి తీసుకుపోయి, పువ్వులూ, కాయిలూ చూపించాడు. దానిమ్మపువ్వులతో చాలసేపు ఆడుకున్నాడు శంకు. ఎలాగయితే నేం తాత తన యుక్తితో అమ్మగురించి శంకు ఆ నిమిషంలో అల్లరి చేయకుండా మరచి పోయేట్టు చేశాడు. అంతలో తిండికి పిలిచారు ఇంట్లో.

'బువ్వ తిందుమా, పదా' అని తనతోపాటు తీసుకెళ్లాడు తాత. శంకు తాతకి ఎదురుగా కూచున్నాడు. తాత శంకు కోసం అన్నం కలుపుతున్నాడు చిన్న గోరు ముద్దలు చేసి. తాత కంచంలో శంకు రెండు చేతులూపెట్టి అన్నం తినాలనే ప్రయత్నంలో అన్నం పారేస్తున్నాడు. అలా మనవల అల్లరితో సర్దుకు పోవడం సూరన్నతాతకి అలవడి పోయింది. వాళ్లతో అడుకోకపోతే ఆ రోజు గడవడమే కష్టమన్నంత ఆలవాటయి పోయింది.

వచ్చి పలకరించి చూసిపోయే బంధువులతో ఇల్లంతా రద్దీగావుంది. వచ్చేపోయేవాళ్ల మర్యాదలు చూసేసరికి సరిపోతోంది సమయం ఆ ఇంట్లోవారికి. తాతకి ఒక్కోసారి ఉప్పెనలా దుఃఖం పొంగుకొస్తోంది. కట్టలు తెంచుకు కన్నీరు ఉరకు తోంది. ఆ దుః ఖం మనవడి దీనస్థితికే కాదు తన ముద్దుల చిన్న కూతురు తనకి మిగల్లేదనికూడా.

రోజు తాత, 'తాతా, అమ్మ?' అనే శంకు ప్రశ్నకి రేపొస్తుందనే జవాబు చెబుతున్నాడు. అమ్మ ఎప్పటికి రావడంలేదు. అర్ధరాత్రి లేచి పిలిస్తే ఇంకేదో గొంతు వినబడుతోంది. ఏడుస్తాడు బావురుమని. ఓదార్చి నిద్ర పోనిస్తున్నారు. తాత మాటలమీద నమ్మకం పోయింది. అయినా అడుగుతూనే ఉన్నాడు. ఇంక రాదన్న నిరాశ కలిగినపుడు, బావురుమని అమ్మా, అమ్మా అని అమ్మకి తన పిలుపు వినిపించేటంత బిగ్గరగా ఏడుస్తున్నాడు. మిఠాయి తెస్తుందనీ, బొమ్మలు ఇస్తుందనీ, తాతగారి ఊరు వెళ్లిందనీ, రేపే వచ్చేస్తుందనీ చెప్పి చెప్పి, ఓదార్చి ఓదార్చి విసుగెత్తి పోయాడు తాత.

కొన్నాళ్ల తర్వాత తాత శంకుకి అమ్మగురించి చెప్పినప్పుడు యింకో రకంగా మార్పు చేశాడు. అమ్మని దేవుడు తీసికెళ్లిపోయాడు. అమ్మ ఈసారి పండుగ (సంక్రాంతి) కి వస్తుందని. ఆ పండుగ దగ్గరవుతున్నకొద్దీ శంకులో - అమ్మవచ్చి ఎత్తుకుంటుంది. పాలిస్తుంది. ముద్దు పెట్టుకుంటుంది. తన దగ్గర పడుకోబెట్టుకుంటుంది అన్న ఆశ పెరిగిపోతున్నది. అమ్మ దేవుడు దగ్గర్నుంచి తప్పకుండా వస్తుంది. ఎక్కడికెళ్లినా అమ్మ తనకోసం తిరిగి రాకుండా ఉండలేదు. అలాగేవచ్చేది. పొలంపని చేసుకొని వచ్చిన వెంటనే ఎత్తుకొని 'నా బంగారే' అని ముద్దాడి పాలిచ్చేది. అంచేత వస్తుంది. ఆ నమ్మకం రోజురోజుకి శంకులో ఎక్కువైంది.

సంక్రాంతి ముందురోజున 'ఎప్పుడు వస్తుందా రేపు?' అని క్షణ క్షణమూ ఎదురుచూశాడు. తాతని అడిగాడు.

'రేపు తప్పకుండా వస్తుంది - మన పెద్దలంతా వస్తారు. మన యింట్లో బువ్వ తింటారు' అని చెప్పాడు తాత.

'అమ్మకి దేవుడు బువ్వ పెట్టడా తాతా' అని శంకు సందేహం.

'పెడతాడు. మంచిబువ్వ, పెరుగూ, పాలూ, మంచి కూరలూ, కజ్జెమూ, అన్నీ

పెడతాడు' అని తాత చెబితే శంకుకి అమ్మ తనకోసం పళ్ళు, బిస్కెట్లులూ, కజ్జెమూ, జుబ్బాలూ తెస్తుందనే విశ్వాసం పెరుగుతోంది. అమ్మ తనకోసం ఎన్నో తెచ్చేది. ఈ సారి మరీ ఎక్కువ తెస్తుంది. దేవుడు చాలా మంచోడు. చాలా యిస్తాడు. దేవుడు చాలా గొప్పోడు. శంకుకి బలమైన ఆశ ఆధారంగా ఉండిపోయింది.

ఆ సంక్రాంతి రోజు రానేవచ్చింది. అమ్మ వస్తుందిగదా, బుద్ధిగా వుండాలి గదా అని ఏ అల్లరి చేయలేదు. తను లేనప్పుడు వచ్చేస్తుందేమోనని ఎక్కడికీ కదల్లేదు. ఎవరితోనూ వీధుల్లో ఆడుకోలేదు. అమ్మ ప్రత్యక్షం కోసం అనిమేషంగా చూస్తున్నాడు. అమ్మ అందమయిన నడక ఏ పొలం గట్టుమీదనో, ఏ చెరువు కొమ్మునో కనబడకపోతుందా అని, అమ్మ అల్లంత దూరాన కనబడితే పరుగు పరుగున పోయి ఆకాళ్ళు చుట్టేయాలనే గాఢమైనవాంఛ గుండెని కవ్వంలా చిలుకుతోంది.

సంక్రాంతి పెద్దల పండగ. పూజలయ్యాయి. వేళయింది. అంతా తిళ్ళకి కూచున్నారు. తాత పక్కన శంకు కూచున్నాడు. వస్తుందన్న అమ్మ యింకా రాలేదు. ఇంక భరించలేక 'అమ్మేది తాతా?' అన్నాడు.

'అదుగో అదుగో' అన్నాడు తాత.

కనిపించలేదు ఎంత వెతికినా. ఇంట్లో అన్ని దిక్కులూ చూశాడు. తనకి అమ్మ కనబడుతుంది. అలాంటిదీ ఎంత వెతికినా అమ్మ కనపడ్డంలేదు.

'ఏదీ? ఎక్కడ?' అన్నాడు శంకు. తనకి కనబడకుండా అమ్మ ఉంటుందా? కాని కన్పించడంలేదు. తాత 'అదుగో అదుగో' అని యింటి పైకప్పు చూపిస్తున్నాడు. ఆ పైకప్పు నల్లగా మసిబారిపోయి వుంది. కిటికీలు లేవు. అంచేత చిక్కని చీకటి అలుక్కు పోయింది కాటికలాగ.

'అమ్మేది తాతా?' అన్నాడు. తాత కళ్ళల్లోకి శంకు చూశాడు. ఆ కళ్ళల్లో అశ్రువులు నిండానిండి తొణికి బుగ్గలు మీదికి జారుతున్నాయి. ఆ ముఖం నిండా వృద్ధాప్యం సాలెగూళ్ళున్నాయి.

'అదుగో దేవుడు తీసికెళ్లి పోతున్నాడు. దేవునితో ఎల్లిపోతున్నాది' అన్నాడు తాత.

శంకు 'అమ్మా, అమ్మా' అని గట్టిగా అమ్మ పలికేటట్టుగా, అమ్మ తప్పకుండా పరుగు పరుగున తనకోసం తిరిగి వచ్చేట్టుగా పిలిచాడు. అమ్మ పలికేది. అలాంటిదీ అమ్మ దేవుడితో వెళ్లిపోయి తనపిలుపు వినిపించుకోలేదు. అమ్మకి తనంటే ప్రేమ. తనని బొత్తిగా మరచి పోయింది. అమ్మ ఎంత మంచిది! ఎన్ని పాటలు పాడేది! ఎన్ని మాటలునేర్పేది! ఎంచక్కని కథలు చెప్పేది! ఎంతమంచి ఆటలు ఆడించేది! అమ్మ, పిలిచినప్పుడల్లా ఎంత చక్కగా పలికేది! ఏడిస్తే ఎలా బ్రతిమాలి ఓదార్చేది! దాచి కృష్ణకీ ఎవరికి యివ్వకుండా కజ్జెమూ, బొమ్మలూ యిచ్చేది! ఆ అమ్మ దేవుడి దగ్గరికెళ్లిన

తర్వాత యిలా మారిపోయిందేవిటి? దేవుడు మా మంచి వాడంటారంతా. మరి తన అమ్మని ఎందుకు తీసుకుపోయాడు? తీసుకుపోయిన తర్వాత తనకోసం పంపించడేం? తను పిలుస్తుంటే పలక్కుండా ఎందుకు చేస్తున్నాడు దేవుడు? శంకుని యీ ఆలోచనలన్నీ మెరుపు మెరిసినంతా కాలంలో వచ్చి, భయపెట్టాయి. ఆ భయంతో బావురుమని దిక్కులేని ఏడుపు ఏడిచాడు.

తాత ఎత్తుకుని ఓదార్చ ప్రయత్నిస్తున్నాడు. దూడలనీ, పువ్వులనీ, కాయలనూ చూపించాడు. కాని ఏడుపు ఆగలేదు. పిన్నీ, పెద్దనాన్నమ్మా ఎత్తుకున్నారు. కాని శంకు ఏడుపు మానలేదు. ఆ పూలూ ఆ దూడలూ అన్నీ వొత్తివే అనిపించాయి 'అమ్మకావాలి అమ్మ కావాలి' అని ఏడ్చాడు.

అమ్మ దేవుడి దగ్గర్నుంచి వస్తుందని మళ్లీ తాత నమ్మించ జూస్తున్నాడు.

శంకు మాత్రం యీ లోకంలో మనుషులనీ, వాళ్ల మాటలనీ నమ్మకూడదనుకున్నాడు. వొట్టిదే. అమ్మ మరి రాదు. అమ్మని వీళ్లంతా యెక్కడో దాచేశారు. తనని మోసగిస్తున్నారు. అబద్ధాలు చెబుతున్నారు. అలా అనుకున్నాడోఏమో గుక్క తిప్పకుండా ఏడుస్తున్నాడు.

అమ్మని దేవుడు తీసుకుపోలేదని, దేవుడి దగ్గరకి స్వంతగా ఈ ప్రపంచాన్ని చూసి భయపడి తనే వెళ్లిపోయిందని ఎప్పుడన్నా శంకుకి తెలిస్తే - ఆ రోజు - ఆ రోజు ఎంత బాధపడతాడో! అమ్మని కత్తులతో కోసి పోస్ట్‌మార్టమ్ చేశారని తెలిసిన రోజున, తెలిసిన రోజున ఏమయిపోతాడో శంకు? అమ్మ ప్రాణాలొదిలేస్తూ - 'నా-నా-యి-న-' అన్నదన్న సంగతి విన్నరోజున ఈ లోకాన్ని ఏమని తిడతాడో, ఏమని తిడతాడో?!

* * *

(ప్రపంచంలో తన అమ్మని వెతకడం ఆ రోజు ఆరంభిస్తాడు. ఎవరిలో నన్నా అమ్మ కనబడి ఓదార్పు పొందాడా సరేసరి. ఏవరూ నాన్నా అని వొళ్లోకి తీసుకోలేదా? అప్పుడు-

బాధ ద్వేషం అసూయ వెలితి అసహనం కోపం ఈర్ష్య పగ ప్రతీకారం అతడి అంతరాంతరాలలో వలయాలు చుట్టుతాయి.

రాక్షసత్వం ఆ రోజునుంచే అతడ్ని పెంచుతుంది.

నిదర్శనం అందుకు-

పదిమంది హంతకులని పిలిచి వాళ్ల జీవితాలు వినండి. కనీసం ఎనమండుగురు చిన్ననాడు తల్లిని కోల్పోయిన వాళ్లే).

*

మురళి సాహితీ మాసపత్రిక